చిన్న కథ :

# దిబ్బలో నక్సలిజం

— కొడవటిగంటి కుటుంబరావు

"దిబ్బకువెళ్ళి చాలా రోజులైనట్టుంది. ఒకసారి వెళ్ళి వస్తావా ఏం?" అన్నాడు మా పత్రికాధిపతి.

"ఏమిటి విశేషం?" అన్నాను.

"మరేంలేదు-రాజభరణాల రద్దు గురించి కంకార్డ్ చాటుగా ఏమనుకుంటున్నదీ ఆరాతియ్యి. మన రికార్డులో ఉంటుంది." అన్నాడు మా బాస్.

రాజభరణాలను గురించి ప్రభువుల అభిప్రాయం నాకు తెలియనిదికాదు. అది వారికి ఆర్థిక సమస్య కానేకాదు, ఆ పాటి డబ్బు వాళ్ల కళ్లు మూసుకుని సంపాదించగలరు. వాళ్ళకు కావలసింది ఆభరణాల వెంటఉన్న గుర్తింపూ, అధికారాలునూ. సంస్థానాలు రద్దయినా వాళ్ళు ఒక రాజకీయవర్గంగా ఉంటున్నారు. అంతకన్న బలహీనమైన రాజకీయ పార్టీలెన్నో దేశంలో ఆర్భాటం చేస్తున్నాయి. నన్నడిగితే దేశంలోఉన్న నిజమైన రాజకీయ పార్టీలు ఫ్యూడల్ పోరాటంలోనే ఉన్నాయి. రాజులూ, మహరాజులూ ఒక వర్గం, పెద్ద పెద్ద భూస్వాములు ఒక వర్గం. పంచాయితీ బోర్డుల అధ్యక్షులు ఒక వర్గం. ఇవన్నీ ప్రజల మీద ఆధారపడని పార్టీలు; ప్రజల మీద ఆధార పడిబతకటానికి ప్రయత్నించే పార్టీలను ఆడించే పార్టీలు. బూర్జువా వర్గాలు న్నాయనుకోండి. వాటికీ ఈ ఫ్యూడల్ వర్గాలకు మధ్య రాజకీయ ఘర్షణ ఏమీలేదు. రెండు పక్షాలకూ మధ్య లింకులు మన పార్టీలు...

ఈవిషయాలన్నీ మాబాస్‌తో చర్చించటం కంఠ శోష. ఆయన గుర్తించేదిఎన్నికలలో నిలబడే పార్టీలనే. రాజకీయాలకూ, వ్యాయామక్రీడల పోటీలకూ, గుర్రప్పందాలకూ ఆయన సమమైన విలువ ఇస్తాడు. ఏ పార్టీ అధికారంలోకి వొస్తుంది? వింబుల్డన్ కప్పు ఎవరు కొట్టేస్తారు? ఇండియన్ ఓర్బీలో ఏ గుర్రం నెగ్గుతుంది? అదే ఆయనకు కావాలి.

* * * * *

నేను దిబ్బకు బయలుదేరింది రాజభరణాల గురించి కానేకాదు. అక్కడ నక్సలైట్లు ఏంచేస్తున్నారో తెలుసుకునేందుకు.

అయిదారు నెల్లకింద దిబ్బ రాజావారికి నక్సలైట్లను గురించి అడుగుతూరాస్తే, "దిబ్బలో నక్సలైట్లులేరు. ఇక్కడ కమ్యూనిస్టులే లేరు. కమ్యూనిస్టులుంటే గద, ఒకటి రెండవుతుంది అన్నసూత్రం మీద కుడి కమ్యూనిస్టులూ, ఎడమ కమ్యూనిస్టులూ ఎడమ కమ్యూనిస్టుల్లో మితవాదులూ, అమితవాదులూ, అమిత వాదుల్లో పరిమితవాదులూ, నక్సలైట్లూ ఏర్పడేది?" అని వారు నాకు రాశారు.

అయినా నాకు నమ్మకం కలుగలేదు. ప్రపంచంలో బయలుదేరే ప్రతి ఉద్యమానికీ దిబ్బలో ప్రతిధ్వనులు వస్తాయని నా అనుమానం. కిందటిసారి నేను దిబ్బ వెళ్ళినప్పుడు అక్కడ నాకు అమెరికన్ హిపీలు కనిపించారు.

దిబ్బకూ మిగతా ప్రపంచానికీ దాదాపు ఏ సంబంధమూ లేకుండా జరుపుకువచ్చినవాడు దిబ్బ ప్రభువుగారి తాతాగారు. దిబ్బకు పక్కారోడ్డులేదు, ఆయన బొందలో ఊపిరి ఉన్నంతకాలమూనూ. తరవాత కంకరరోడ్డు పడింది. దాన్ని ఆవిష్కరించినది గవర్నరుగారికారు - మన నాటు గవర్నరుగారుకాదు. సిసలైన తెల్లగవర్నరు. (ఆయన దిబ్బనగరం నడివీధుల్లో కుక్కలనీ, ఊరపందుల్నీ వేటాడాడని చెప్పుకున్నారు. దిబ్బ నగరం ఆయన ప్రాణానికి ఒక అరణ్యంగానూ, దిబ్బప్రజలు ఆటవికుల్లాగానూ, వాళ్ళు పెంకునే కుక్కలూ, పందులూ వన్యమృగాల్లాగానూ తోచివుండాలి.)

"మనకు పనికి వస్తుందా, లేదా?" అని ఆలోచించకుండా ప్రపంచంలో ఎక్కడెక్కడ ఏది కొత్తగా వెలిస్తే దాని వెంటపడే మనస్తత్వం భారతీయుల కున్నమాట అపద్దంకాదు.

ఇండియన్ హిపీలనే తీసుక్కోండి వాళ్ళు అమెరికన్ హిపీలను అనుకరిస్తున్నారు ఎందుకూ? అమెరికన్ హిపీలు మన బైరాగులకు అనుకరణ. అందరికన్నా ముందుగా హిపీలను సృష్టించింది మనమే — గంజాయీ, నల్లమందూ, చరస్ వగైరాలతోసహా. కాని మన హిపీలు బైరాగులుకారు. అమెరికన్ హిపీలకు నకళ్ళు.

అన్నిట్లోనూ మనది ఇదేవరస. ఒక కర్నాటక కృతి బాణీలో ఒక మహారాష్ట్రపాట తయారైతే, దాన్ని అనుసరిస్తూ ఒక తెలుగుపాట మళ్ళీవచ్చింది! పేరు తెచ్చుకుంటున్న ఇంగ్లీషు సాహిత్య ధోరణులను అనుకరిస్తే మన సాహిత్యం అట్లాగే పైకి వచ్చేస్తుందని మనవాళ్ళ నమ్మకం. మనదేశంలో చదివేవాళ్ళ ప్రసక్తి ఏమీలేదు.

రాజకీయాలూ అంతే. ప్రజల గొడవ ఏమీలేదు. సిద్ధాంతాలు సరిగా ఉన్నాయా, లేదా? అదిచాలు! రాజకీయ విభేదాలు ఎందుకంటే ఒక్కొక్క పార్టీ ఒక్కొక్క అడుగుజాడల్లో నడుస్తుంది. ఒకపార్టీకి పనికివచ్చే అడుగుజాడలు మరొకపార్టీకి పనికిరావటం లేదు. అదీ ఘర్షణలకు మూలకారణం.

దిబ్బ చేరాను. కాని రాజావారి దర్శనంకాలేదు. వారు రాజస్థాన్ పర్యటనలో ఉన్నారట.

దివాన్జీగారిని రాజభరణాలను గురించిఅడిగాను.

"మీకు తెలీదా! రాజావారు చాలా బీదవారు. ఈ ఇరవైవేలూ రాకపోతే వారికెలా జరుగుబాటు అవుతుందో నాకు అంతు చిక్కటంలేదు. గాంధీగారి పార్టీవాళ్లే ఆడితప్పితే ఇక కమ్యూనిస్టులవంటి రాక్షసులు మాటనిలబెట్టుకొంటారా? దేశంలోవుండే నాస్తికులకూ, అధార్మికులకూ కాంగ్రేసువారు చాలా సహాయపడుతున్నారు. ఆ సంగతి వారు గుర్తించటంలేదు. రాజ్యాంగాన్ని చీటికిమాటికి సవరిస్తుంటే రేపు కమ్యూనిస్టులు మొత్తం రాజ్యాంగానికే ఎసరుపెడతామనరా? వారిని తప్పుపట్టగలమా? "అన్నారు దివాన్జీ, రాజభరణాలు, రాజకీయాలూ కట్టిపెట్టి అసలుసంగతికివచ్చాను

"దివాన్జీ, మనదిబ్బలో నక్సలైట్లు ఏమంటున్నారు? వాళ్లను అదుపులోపెట్టటానికి సీఆర్పీనిగాని, మిలిటరీనిగాని తెప్పించమంటారా?"

"ఎందుకండీ? ఆ దోపితలాటకం! డబ్బుఖర్చు! మన పొలిమేరలో నక్సలైట్లులేరు. వుండరుకూడా! వొకవేళ వాళ్లదిగుమతి అయితే ఏంచెయ్యాలో తెలీదు ఈ రాజభరణాలుకూడా రద్దుచేస్తే మనం వున్న పోలీసుశాఖనుకూడా రద్దుచేసుకోవాలనిపిస్తుంది. చెప్పానుకానా? దేశంలో దౌర్జన్యాన్ని, అరాచకాన్నీ పెంచే పనులన్నీ మనపాలకులు చేస్తున్నారు. చెబితే వినరు, అర్థంచేసుకోరు దేశమంతటకీ నిజమైన రాజకీయ విజ్ఞాని ఆమహానుభావుడు రాజగోపాలాచారిగారు ఒక్కడే కనిపిస్తున్నాడు. మిగిలిన వాళ్లంతా అంధకారంలోపడి కొట్టుకుంటున్నవారే! ఈమధ్య రాజాజీ రాసిన వుత్తరంచూస్తే అంతామీకే తెలుస్తుంది."

దివాన్జీ రాజాజీవుత్తరంకోసం వెతకటానికి అయిదునిముషాలుపైబిచ్చి. "మహాత్మ దర్శనం చేసుకొంటాను" అని బయలుదేరాను.

* * * * *

దిబ్బనగరం దాటగానే ఒక అందమైన మైదానం వున్నది. అందులోవున్న రక్కెసలూ. జిల్లేళ్ళూ మహా చూడముచ్చటగా వుంటాయి, రక్కెసల్లో నాగుపాములు ఆడుకుంటూంటాయి.

మైదానాన్నిఆనుకొని ఒక పంట కాలవవున్నది. దాన్ని దిబ్బరికార్డులలో "బుల్లేరు"అని ఉదహరిస్తారు. "బుల్లి ఏరు" అని కాబోలు,

దిబ్బరాజుగారి తండ్రిహయాంలో కంకరరోడ్డు పడినప్పుడు బుల్లేరుమీద ఆరడగుల నిడివిగల వంతెన కట్టి రోడ్డుకు అటూ. ఇటూ విశాలమైన అరుగులు ఏర్పాటుచేశారు.

ఆ వంతెనమీద కూర్చుని నాకు ఒక రైతులాటి మనిషి కనిపించాడు. అతగాడు కూర్చున్న అరుగు మీదికి సీమచింతచెట్టు నీడపడుతున్నది.

నేనుకూడా అతనిపక్కనే కూర్చుని "ఈ యేడు వర్షాలు బాగాపడ్డట్టున్నాయి ఇక్కడకూడా''అన్నాను.

రైతువెంటనే జవాబియ్యక తననెత్తిమీద తలగుడ్డలోనుంచి వొక పొగాకుకాడతీసి, రెండుపాయలు చేసి, వొక పాయనాకిస్తూ, "కాల్చండి డిబ్బ పొగాకు మాప్రశస్తం" అన్నాడు.

మర్యాదకు చుట్టవెలిగించాను. పొగ నసాళానికంటింది. దగ్గాను.

రైతునవ్వి "నే జెప్పలా? సిగిరెట్టు దమ్ములాగినట్టు లాగితే ఏమవుతుంది?" అంటూ తానుకూడా చుట్ట నోటబెట్టాడు.

(తరువాత చివరి పేజీలో)

# 'అభ్యుదయ' శబ్దం — దాని నేటి అర్థం

(11వ పేజీ తరువాయి)

హనుమంతరావుగారి మాటల్లోనే "ఎవరి మార్గానవారు అభివృద్ధి కోరుకొంటారన్న దిగజారుడు సిద్ధాంతానికి వచ్చి వర్ణాశ్రమ ధర్మానికి, భూస్వామిక దోపిడీకీ, పెట్టుబడిదార్వీ వ్యవస్థకూ సామ్రాజ్యవాద అభివృద్ధికీ కీర్తనలుపాడేవారినీ వేయిపడగలు విప్పి నాట్యమాడే వారినీ దాశ్శాయల రానీయనూ కూడదు".

అభ్యుదయం అంటే పీడితవర్గాభ్యుదయమే! "అభ్యుదయ" శబ్దాన్ని జోడించుకొని వున్నరచయితలసంఘం తన శవాలంకరణకోసం అనభ్యుదయ రచయితల ప్రాపకానికి ఎగబడుతున్నప్పుడు, యధార్థమైన, యుగానుగుణ్యమైన అభ్యుదయాన్ని సాహిత్యంలోనూ సంఘంలోనూ సాధించడం కోసమే విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. ఇది మార్క్సిస్టు రచయితల వేదిక అనడంలో అవమానపడవలసిందేమిలేదు. అగణ్యంగావస్తూన్న కొత్తకవులలో ఎక్కువ భాగం ఈ వేదికమీదికే వస్తూన్నారు. వీరితోనే ఇది విశాలంకావాలి.

"విశాలవేదిక" అనేది దాదాపుగా నినాదప్రాయమైపోయింది. ఒక సంఘానికిగల పరమాశయం భంగపడేవిధంగా ఎవళ్లనుపడితే వాళ్లనుసభ్యులుగా చేర్చుకోవడం, ఆసంఘానికి ముందుగానే సమాధి తయారుచేసి పెట్టినట్లౌతుంది. ఆ పరమాశయానికి తోడ్పడగల వాళ్లను అందరినీ సమీకరించడమంటే అదిపూర్తిగా వేరేప్రతిపాదన. దానికి ఎవడూ అడ్డనిలవడు. విప్లవ రచయితల సంఘం సమగ్రమైన సాంఘికవిప్లవానికి సాహిత్యన్ని అంకితంచేయబూనుకొంది. ప్రస్తుతదశలో ఇంతకంటే మహత్తరమైన లక్ష్యమేదీలేదు. అట్లని, ఈ మహాచారిత్రకదశలోని అంతర్దశలలో ఒకొక్కదానికీ ఒకొక్క లక్ష్యంలేదనలేను. అయితే, ఇవన్నీకలిసి చరమాశయానికి దోహమంచెయ్యడానికే తప్ప దాన్ని నీళ్లగావించి వెయ్యడానికిమాత్రంకాదు. విప్లవ రచయితల సంఘసభ్యులు ఆ సుదూరలక్ష్యాన్నీ ఈసమీపలక్ష్యాలనూ రెంటినీ ఉపలక్షించి వాటికి అభిముఖంగా నడుస్తారు. అలానడవబూనుకొన్న రచయితలను, వాళ్లవాళ్లగతం ఎలాంటిదైనా, ఈసంఘంలోనికి ఆహ్వానిస్తారు

అభ్యుదయం అంటే ఈకాలానికి ఇదె, భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని వర్తమానకాలాన్ని ముందుకు తోలడమన్నమాట. అంతేగాని, వేమన సరేసరి, వీరేశలింగం, గురజాడలనాటి అభ్యుదయమూ నేటిఅభ్యుదయమూ ఒకేలాంటివని సిద్ధాంతం చెయ్యడంవుందే, అది వర్తమానకాలాన్ని భవిష్యత్ప్రమాణంలో కొలవడానికిబదులు, భూతకాలప్రమాణంలో కొలవబూనుకొంటుంది. ఎదిగివచ్చినబిడ్డకుగాని చిన్ననాటికొలతలతో వుడుపులుకుట్టిస్తే ఎలాగుంటుందో అలాగేవుంటుంది. అవయవాలు కొన్నాళ్లకైనా దొల్లుడొల్లుగా వున్నదిరుసుకు తగినట్లు ఎదుగుతాయిగాని అవే బిర్రుగావుంటే, బిర్రుగావుండుటమేగాక లోహకవచంలా తయారయితే, ఎదుగుదలకు ఆటంకంగా పరిణమిస్తాయి. అంటే. గతకాలపు అభ్యుదయలక్ష్యం వర్తమానకాలాన్ని నిబధించి వెయ్యగూడదన్నమాటే. అభ్యుదయవాదికీకళ్లు మూసుకుంటే గుంటలోవుంటే అతనేం అభ్యుదయవాది?

గడచిపోయినరోజుల్లో మనస్వులైన రచయితలు ఆశించిన అభ్యుదయం యావత్తూ ఇప్పుడు అనుభవానికి వచ్చిందని నేననడంలేదు. వీరేశలింగంగానీ గురజాడగానీ సంస్కరణలనాశించారు. అవి అన్నీ సిద్ధించలేదు. సంఘం మళ్లీపాతపద్ధతులపాలైపోయి వుంది. చిట్టిపొట్టి సంస్కరణలద్వారా ఈ సంఘాన్ని మేలురకం మనుషులకు నివాసయోగ్యం చెయ్యలేము. సమూలమైనమార్పు అన్నిస్థాయిల్లో మొదటరాందే, ఈచిల్లరమల్లర భావపిశాచాలపట్టు మనస్సులనుంచి తప్పుకోదు. కాబట్టి ఈ రోజుల్లోకూడా ఏ రచయితైనా అలనాటి సంస్కరణవాదానికే తనలేఖినిని అంకితంచేసి అదే పరమార్థమనుకొనేట్లయితే. అతగాడు జాలిపడదగినవాడే. అలాగే ఇంకొకరకం రచయితవున్నాడు. సమసమాజాన్ని పెదిమలతో మాత్రమే కీర్తిస్తూ చేతితో భంగపరుస్తాడు, అసాధ్యమైన అనాచరణీయమైన శాంతియుత పరివర్తనాన్ని ఆ లక్ష్యసాధనకు ఏకైక మార్గమనుకుంటాడు. కరుణ, జాలి, మంచితనం, ఆందం, ప్రేమ వగైరా దినుసులతోటి మాత్రమే వ్యక్తినీ సంఘాన్నీ తయారుచేస్తానంటాడు. ఎంత చూడచక్కనిదైనా, ఇది కలమాత్రమే. తనఊహమట్టుకే. ఈ కలలతో ఊహలతో కవిత్వాన్ని రమణీయం చెయ్యవచ్చునేమోగాని నిజాన్ని తుడిచివెయ్యడం సాధ్యంకాదు.

నిష్ఠురమైనాసరే, నిజాన్ని నిజంగా అంగీకరిస్తూ దాన్ని ఆదర్శం కొలతలకు మార్చివెయ్యడమే

# సాహిత్యం ఎందుకు?

(13వ పేజీ తరువాయి)

చేస్తారు (తమకి జరిగిన ఏ అన్యాయం ఫలితంగానో?) కాని, ఈ రచయితలు సమాజానికంతటికి ద్రోహం జేస్తున్నారు. ఇది నీచాతి నీచమైన ద్రోహం. వాళ్ళ సమాజం గుండెల్లో రక్త ప్రవాహాన్ని ఆపేసి. నరాలని మొద్దుబారిపోయేలాగాచేసి, ఆలోచనని స్తంభింపచేసి, కుళ్ళిపోయిన కుష్ఠురోగిలాగ సమాజాన్ని శవాకారంచేసి దోపిడీదార్ల పక్కలోకి చేర్చి, భయంకర రాక్షస రతికి గురిచేస్తున్నారు.

మంచి చెయ్యలేనివాడు కనీసం చెడు చెయ్యకుండా ఉండాలి. లేకపోతే, వాడి అంతరాత్మ ఏమీఅనకపోయినా, కాల గమనంలో సమాజంచేత తీవ్ర శాపానికి గురికాక తప్పదు.

# దిబ్బలో నక్సలిజం

(15 వ పేజి తరువాయి)

"పంటలతో మాకు ఏనాడు పేచీలేదు. బాబూ! దేశమంతటా కరువొచ్చినా దిబ్బకుతిండికొరత వుండబోదు కాని ఇట్టా ఎంతకాలంసాగుతుందీ! అని "అన్నాడతను

"అదేం?"

"ఈ నగసలైట్లు మమ్మల్ని పొలాలు జేసుకోనిచ్చేట్టులేరు!"

గతుక్కుమన్నాను. దిబ్బలోకూడా నక్సలైట్లున్నారన్నమాట! నేను అనుమానిస్తున్న దే! కాని......ఈ మనిషి పెద్దభూస్వామిగా కనిష్పించటంలేదు. యిక్కడి నక్సలైట్లు చిన్న రైతులనుకూడా బాధిస్తున్నారా?

"ఏంచేస్తారు మీ నక్సలైట్లు?" అన్నాను.

"వాళ్లకిచాతనయింది వొంటేగా? పొలాలు లాగేసుకుంటారు."

"భూస్వాముల పొలాలు లాగేసుకుంటే మీబోటి వాల్లకేం నష్టం?" అన్నాను.

'భూస్వాముల పొలాలు లాగేస్తారా? ఎన్నిగుండెలు మాబోటీ బిక్కరైతుల పొలాలు కాజేస్తున్నారు. భూస్వాముల పొలాలులాగేస్తే వారికోపు కాసేదెవరు?' అన్నాడు రైతు.

అతనిమాటలు నాకు అయోమయంగా కనిపించాయి. భూస్వాములు నక్సలైట్లకోపు కాయటమేమిటి? ఈ దిబ్బలోఈ తరగతి మనుషులకు రాజకీయ పరిజ్ఞానం ఏమీ వుండదు.

"పోనీ, నక్సలైట్లచర్యలవల్ల మరింత భూమిసాగులోకిరావటము, పంటలు జాస్తికావటమూ జరుగాలి గదా!" అన్నాను.

నీకేమన్నా మతిపోయిందా? అన్నట్టు అతను నాకేసి కళ్లుపెద్దవిచేసి చూసాడు.

"నగ్సలైట్లకు కావాలసింది పొలాలు సాగుకావటమా? ఎవరన్నారు?" అన్నాడు.

"మరేమిటి? పేద రైతులకు పొలాలు అందటమూ, వారి హక్కులను కాపాడటమూ కూడా నక్సలైట్లుకోరేది?" అన్నాను.

రైతుగట్టిగా నవ్వాడు.

"ఈ దేశంలో నగ్సలైట్లుకోరేది పొలాలు ఎండగట్టటం. బీదోల్ల పొలాలుకాజేసి భూస్వాములకివ్వటం. నక్సలైట్లకు కరణాలు, మునసబులు కుమ్మక్కు. పోలీసులు అండ! పెద్దనగసలైటు అన్నాడు—దిబ్బ ప్రజలు తిండీఎక్కువై, కొవ్వి, చెప్పినమాటవినకుండా వున్నారట! దిబ్బకు తిండికరువొస్తేగాని మేమంతా బాగుపడమంట!"

"ఎవరా పెద్దనక్సలైటు?" అన్నాను.

"ఇంకెవరు? రాజాగారే?...చూస్తూండు, మాకుర్రకారు ప్రాణంవిసిగున్నారు. ఈ నగసలైట్లు నందర్ని పాముల్ని కొట్టినట్టుకొట్టి దిబ్బకు ఈ పీడ విరగడ చేస్తారు. ఎంతోదూరంలోలేదు!" అన్నాడు రైతు. ఆకినచుట్ట అవతలపారేసూ"

Edited and Published by M. V. Ramana Reddy, Printed by C. Rangappa at Sarathi Press, office at Holmespet, Proddatur. Cuddapah. Dt.